## రైలు కింద పడి బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:**

రైలు కింద పడి ఓ బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చేటుచేసుకుంది. ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్య ఎన్ఎఫ్‌సీనగర్ వంతెన వద్ద రైలు పట్టాలపై ఓఅమ్మాయి మృతదేహం పడి ఉందని సోమవారం ఉదయం సమాచారం రావడంతో సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. లభించిన ఐడి కార్డు ఆధారంగా పోలీసులు వివరాలు సేకరించారు. మృతురాలు దుంపటి హితవర్షిణి (20)గా గుర్తించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్‌లోని విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ (ఎఐ-డిఎస్) 4వ సంవత్సరం చదువుతున్నది. మూడు రోజుల క్రితం తన సొంత గ్రామంకు వెళ్లి తిరిగి వస్తూ ఈనెల 7న రాత్రి 9:15 గంటల ముందు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. ఈమేరకు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి శవాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని జీఆర్‌పీ పోలీసులు తెలిపారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

# వార్త

## జిల్లా అదనపు ఎస్పీగా రాములు నాయక్

**వికారాబాద్, సెప్టెంబర్08, ప్రభాతవార్త ః**

జిల్లా అదనపు ఎస్పీగా బి.రాములు నాయక్ మంగళవారం బాద్యతలు స్వీకరించారు. నిర్మల్ జిల్లా నుంచి అటాచ్‌గా వికారాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయానికి ఉన్నతాధికారులు అటాచ్ చేశారు. ఈ విషయమై బాద్యతలు స్వీకరించి జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిశారు.



జిల్లా ఎస్పీ నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా అదనపు ఎస్పీ రాములు నాయక్

## వీధి కుక్కల నుండి కాపాడండి మహాప్రభో!

**-మొన్న రంగాపూర్.. నిన్న తాటిగడ్డ తండా**

**-వణికిపోతున్న గ్రామీణులు**



తాటిగడ్డ తండాలో గుంపులు గుంపులుగా వెళ్తున్న గ్రామ సింహాలు.

**నందిగామ సెప్టెంబర్ 9 ప్రభాతవార్త**

నందిగామ మండలం రంగాపూర్, తాటిగడ్డ తండా గ్రామాలలో గ్రామసింహాలు వణికిసున్నాయి. ఎక్కడినుండి వచ్చాయో కానీ అడుగడుగునా గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. గత కొన్ని రోజుల క్రితం తాటిగడ్డ తండాకు చెందిన జటావత్ రామ్మోహన్ నాయక్ పెంచుకున్న మేకలపై విచక్షణ రైతంగా దాడి చేసి చంపేశాయి. మేకల పోషణ పై ఆధారపడి జీవిస్తున్న రామ్మోహన్ సుమారు రూ. లక్షకు పైగా విలువచేసే మేకలు విగత జీవులుగా మారిన ఘోర కలిని చూసి నిర్ఘాత పోయారు. గత నెల రోజుల క్రితం రంగపూర్ శివారులో పెంచుకున్న నాటు కోళ్ల పై వీధి కుక్కలు దాడి చేసి నష్టపరిచాయి. కుక్కల బీభత్సాన్ని చూసి యజమాని కుటుంబకులు కన్నీరు మున్నీరయ్యారు. చీకటి పడిందంటే ఈ గ్రామ సింహాలతో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.సలివేన్నద్రగూడెంలో వీధి కుక్కలు రహదారిపై రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులపై విరుచుక పడుతున్నాయి. గ్రామ సినిమాల బారి నుండి రక్షించడం కోసం సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఏది ఏమైనా ఈ గ్రామ సింహాల బారి నుండి తప్పించడం కోసం జాగ్రత్తలు వహించాల్సిన అవసరం ఉంది.

# మాకొద్దీ రీజినల్ రింగురోడ్డు

**-అధికారులకు వినతి పత్రాలు అందజేత -ప్రభుత్వం స్పందించకుంటే ఉధ్యమాలకు సిద్ధం అంటున్న గ్రామాల రైతులు**

**పూడూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :**

రీజినల్ రింగురోడ్డు(ట్రిపుల్‌ఆర్)లో భూములు కోల్పోతున్న భూనిర్వాసితులు ఉధ్యమాలకు సిద్దమవుతున్నారు. రవాణా సౌకర్యం సులభతరంతోపాటు హైద్రాబాద్ చుట్టు ప్రక్కల ప్రాంతాల అభివృద్ధిని కాంక్షిస్తూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రాష్ట్రరాజధాని హైద్రాబాద్ చుట్టూ రీజిలన్ రింగురోడ్డును నిర్మించతలపెట్టి గతంలో కేంద్రానికి రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదనలు పంపగా ఆమోదం తెలుపడంతో మొదటి విడుతగా ఉత్తర ప్రాంతంలో భూసేకరణతో పాటు దాదాపు నిర్మాణపు పనులుకూడా ప్రారంభిస్తున్నట్లు ప్రచారంకూడా జరిగింది.అయితే దక్షిణ భాగంలోకూడా ట్రిపుల్ ఆర్‌రోడ్డు పనులు ప్రారంభించేందుకు సిద్దమవుతున్నట్లు పేర్కొంటున్న సమయంలో గత సంవత్సరం ప్రభుత్వ యంత్రాంగా అక్కడక్కడ మార్కింగ్‌లు కూడా ఇచ్చింది.ఈ మార్కింగ్ ఇచ్చిన ప్రాంతంగుండానే ట్రిపుల్‌ఆర్ వెళుతున్నట్లు ప్రసారమాధ్యమాల్లో పుకార్లు శికారుచేశాయి. ఇందులో భాగంగానే వికారాబాద్ జిల్లా పూడూరు మండలం కడ్మూరు,మిట్టకంకల్,రేగడి మామిడిపల్లి, చెన్‌గోముల్,అంగడి చిట్టంపల్లి తదితర గ్రామాల మీదుగా వెళుతున్నట్లు గతంలో ప్రచారంకూడా జరిగింది. దీంతో వికారాబాద్ జిల్లా కేంద్రం సమీపంనుండి ఈరోడ్డు వెళితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతున్న ఉద్దేశంతో గతంలో పరిగి ఎమ్మెల్యే,డిసిసి అధ్యక్షుడు టి రామ్మోహన్‌రెడ్డి,రాష్ట్రశాసనసభ స్పీకర్,వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌లు సిఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు.అయితే రాష్ట్ర ప్రభుత్వ విన్నపమో?లేక కేంద్రప్రభుత్వ నిర్ణయమో?తెలియదుకాని గతంలో మార్కింగ్ ఇచ్చిన దానిని మార్పుచేసి గతనెలలో పూడూరు మండలం పరిధిలోని తుర్కపల్లి,గట్టుపల్లి, మంచన్‌పల్లి,కెరవెల్లి,పెద్ద ఉమ్మెంతాల్ ,రాకంచెర్ల ,పూడూరు,గొంగుపల్లి,మన్నెగూడ,ఎన్కెపల్లి గ్రామాల మీదుగా రీజినల్‌రింగురోడ్డు(ట్రిపుల్‌ఆర్)వెళుతున్నట్లు ఆయా గ్రామాలకు చెందిన భూముల సర్వేనెంబర్లను ప్రకటిస్తూ అలైన్‌మెంట్‌కు హెచ్ఎండిఏ ప్రాథమిక నోటీఫికేషన్ జారీచేస్తూ,డిజిటల్ మ్యాఫ్‌నుకూడా విడుదల చేసింది.రీజినల్ రింగురోడ్డులో పోయే భూముల రైతులనుండి అభ్యంతరాలను స్వీకరించేందుకు ఈ నెల 15వతేదీవరకు గడువు విదించింది.ఆతరువాత తుది నోటీఫకేషన్ విడుదల చేయనున్నట్లు పేర్కొంది.దీంతో ఈరీజినల్ రింగురోడ్డు(ట్రిపుల్‌ఆర్)లో ఎక్కువ మంది భూములు కోల్పోతున్నది సన్న,చిన్నకారు రైతులేనని, ఈభూములు వ్యవసాయసాగుకు అనుకూలమైనవి కావడంతో వివిధ రకాల పంటలు పండిస్తూ జీవిస్తున్నామని,తమ జీవనాధారమైన భూములను ప్రభుత్వం తీసుకుంటే తమ కుంటుంబాల మనుగడ ప్రశ్నార్థకమేనని ఆయా గ్రామాల రైతులు ఆవేధన వ్యక్తంచేసున్నారు.ఇట్టిరోడ్డు వందమీటర్ల వెడల్పుతో నిర్మించడం వల్ల ఎకరం,రెండు ఎకరాల రైతులు పూర్గిగా భూములను కోల్పోవాల్సి వస్తోందని వివరించారు.ఈ మేరకు ఆయా గ్రామాల రైతులు రీజినల్ రింగురోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ సోమవారం హెచ్ఎండిఏ కమీషనర్‌కు,మంగళవారం వికారాబాద్‌జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలను అందజేశారు.రీజినల్ రింగురోడ్డుకు వ్యతిరేకంగా ఆయా గ్రామాల్లోని రైతులు జెఎసిలుగా ఏర్పడి పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు పలువురు రైతులు వివరించారు.

**ప్రభుత్వం ఇచ్చే నష్ట పరిహారం సరిపోకనా ?**

రీజినల్ రింగురోడ్డు(ట్రిపుల్‌ఆర్)లో భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం సరిపోదనే వాదనలుకూడా వినిపిస్తున్నాయి. రాష్ట్రరాజధానికి సుమారు 60కిలోమీటర్ల దూరంలో ఉన్న వికారాబాద్ జిల్లాలో రియల్‌ఎస్టేట్ ప్రభావంతో భూములకు రెక్కలు వచ్చి ఎకరంభూమి రూ.కోట్లల్లో పలుకుతోందని,ఈ రోడ్డులో భూములను కోల్పోయిన రైతులకు ఆయా గ్రామాల ఎకరంభూమి వ్యాలివేషన్ ప్రకారం మూడంతలు వస్తుందన్న ప్రచారం కొనసాగడంతో ప్రభుత్వంఇచ్చే నష్ట పరిహారంతో పక్క పట్టణాల్లో ప్లాట్లు కొందామన్నా డబ్బులు సరిపోవనే వాదనలుకు వినిపిస్తున్నాయి.

**నేవీ రాడార్‌కుకూడా భూములు ఇచ్చాం ట్రిపుల్‌ఆర్‌ను పార్చండి :**

**పిఏసిఎస్ మాజీ చైర్మన్ నర్సింహ్మారెడ్డి**

గతంతో నేవీరాడార్ కేంద్రం నిర్మాణానికి పూడూరు మండల కేంద్రంలోని దామగుండం అడవిలో 2వేల8 వందల ఎకరాల భూమిని ఇచ్చాం.రీజినల్ రింగురోడ్డు(ట్రిపుల్‌ఆర్)లో మాగ్రామానికి చెందిన సుమారు 3వందల ఎకరాల భూమి పోతుంది.ఇందులో పేదరైతులే ఎక్కువ.రీజినల్ రింగురోడ్డు అలైన్‌మెంట్‌ని మార్చి పేదలకు న్యాయం చేయండి

**మాకొద్దీ రింగురోడ్డు : మండల బిజేపి మాజీ అద్యక్షుడు జాజుల అనీల్**

మాగ్రామంలో ఎస్‌టి,ఎస్‌సిల కుటుంబాలే ఎక్కువ. వారిభూములే రీజినల్ రింగురోడు (ట్రిపుల్‌ఆర్)లో పోతున్నాయి.వారికి ప్రధాన జీవనాధారం వ్యవసాయం వారి భూములను కోల్పోకుండా చూచే బాధ్యత ప్రభుత్వానిదే.

**అలైన్‌మెంట్‌ను మార్చకుంటే ఉధ్యమిస్తాం : పరిగి ఏఎంసి మాజీ డైరెక్టర్ లక్కం సత్యనారాయణ**

పూడూరు మండలంలోనే వ్యవసాయ రంగానికి పెద్దపీఠవేసేది మంచన్‌పల్లి గ్రామం.ఈ గ్రామంలో వాణిజ్య పంటలతోపాటు, కురగాయలు,చిరు ధాన్యాలు ఎక్కువగా పండిస్తారు. రీజినల్ రింగురోడ్డు(ట్రిపుల్‌ఆర్)లో భూములు కోల్పోతున్నది బడుగు,బలహీన వర్గాలకు చెంది న సన్న,చిన్నకారు రైతులే ఎక్కువ.తమకు అన్యాయం జరిగితే వేరుకునేదిలేదు.ఉధ్యమించేందుకు సిద్ధంగా ఉంటాం

## సమాజంలో ఉపాద్యాయ వృత్తి మహాగొప్పది : ఎమ్మెల్సీ ఎవిఎన్ రెడ్డి

**-మేడ్చల్ కలెక్టరేట్‌లో ఉపాద్యాయ దినోత్సవం**



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఉపాద్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఉత్తమ ఉపాద్యాన్ని సన్మానించిన ఎమ్మెల్సీ ఎవిఎన్ రెడ్డి,పాల్గొన్న అదనపు కలెక్టర్ రాధికగుప్తా, డిఇఓ విజయకుమారి తదితరుల దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 9, ప్రభాతవార్త**

సమాజంలో ఉపాద్యాయ వృత్తి మహాగొప్పదని, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాద్యాయులేనని ఎమ్మెల్సీ ఎవిఎన్ రెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురుపూజోత్సవ (ఉపాద్యాయ దినోత్సవ) కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆ తరువాత ఉత్తమ ఉపాద్యాయులను ఎమ్మెల్సీ ఎవిఎన్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా, డిఇఓ విజయకుమారిలు ఘనంగా సన్మానించి మెమొంటోలను, ప్రశంసపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా విచ్చేసిన ఎమ్మెల్సీ ఎవిఎన్ రెడ్డి మాట్లాడుతూ జన్మనిచ్చేది తల్లిదండ్రులు అని, సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంలో నిర్మాతలుగా కూడ వ్యవరించేది ఉపాద్యాయులని అన్నారు. గురువులు ఎక్కడ గౌరవింపబడుతారో అక్కడ సమాజ రూపకల్పన జరుగుతుందన్నారు. ఏరంగంలోనైనా రాణించాలన్న ఉపాద్యాయుల పాత్ర కీలకమన్నారు. గురువు ప్రాధాన్యతను తెలియజేయటానికి గురుపూజోత్సవ కార్యక్రమాన్ని జరుపుకుంటామన్నారు. ఉపాద్యాయ వృత్తి మీదనే సమాజం ఆధారపడి ఉంటుందని ఆయన అన్నారు. ఉపాద్యాయుల భాగస్వామ్యంతోనే ఎంతో మంది ఉన్నతమైన పదవులలో రాణిస్తున్నారన్నారు. విద్యార్థిలోని నైపుణ్యాన్ని బయటికి తీసేలా విద్యార్థులను ఉపాద్యాయులు తీర్చిదిద్దాలన్నారు. ఉపాద్యాయులు అందరికి ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్సీ ఎవిఎన్ రెడ్డి సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా మాట్లాడుతూ విద్యాపరంగా రాష్ట్ర స్థాయిలో మేడ్చల్ జిల్లా ప్రత్యేక స్థానంలో ఉందని దీనికి ఉపాద్యాయులే కారణమన్నారు. జిల్లాలో సుమారుగా 500స్కూల్స్ ఉన్నాయని, అందులో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకవస్తే తప్పనిసరిగా పరిష్కరిస్తామన్నారు. విద్యారంగంలో ఉపాద్యాయుల సేవలు ప్రశంసనీయమన్నారు. ఉపాద్యాయులు ఉత్సాహంగ విధులు నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, వివిధ ఉపాద్యాయ సంఘాల అధ్యక్షులు, ఉపాద్యాయులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో కాళోజీ నారాయణరావు జయంతి



కాళోజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్9, ప్రభాతవార్త ః**

ప్రజాకవి స్వర్గీయ కాళోజీ నారాయణరావు 111 వ జయంతి సందర్భంగా అయన చిత్ర పటానికి జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఇతర అధికారులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశము హాలు నందు బిసి వెల్ఫేర్ అధికారి అద్వర్యంలో ఏర్పాటు చేసిన స్వర్గీయ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ జీవిత చలనశీలి కాళోజి అని, పుట్టుక, చావులు కాకుండా బతుకంతా తెలంగాణ కిచ్చిన మహనీయుడు, వైతాళికుడు కాళోజి అని కొనియాడారు. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా అత ను తన కలం ఎత్తాడు. అత ను స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణా ఉద్యమకారుడని గుర్తు చేశారు. 1992లో భారతదేశ రెండవ అత్యున్నత పౌర పురస్కారం పద్మవిభూషణ్ పొందాడని, ఆయన జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవించిందని. తెలంగాణ తొలిపొద్దు కాళోజీ అని అన్నారు.అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి, అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి. అన్యాయాన్ని ఎదిరించిన వాడే నాకు ఆరాధ్యుడు' అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని అయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుదీర్, ట్రైని కలెక్టర్ హార్స్‌చౌదరి, ఆర్డీఓ వాసు చంద్ర, బీసీ వెల్ఫేర్ అధికారి మాధవరెడ్డి, జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రబాబు గ్రేట్.. మోడీ మరింత గ్రేట్..

**-తెలంగాణలో కాబోయే సీఎం మాత్రం కెసిఆరే**

**-మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**మేడ్చల్, సెప్టెంబర్ 9. ప్రభాతవార్త ః**

ఎప్పుడూ వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచే మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మళ్లీ సంచలనం రేపారు. తన జన్మదినం సందర్భంగా తిరుపతి వెళ్లి స్వామి వారిని దర్శనం చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశమయ్యాయి. మల్లారెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు హైదరాబాద్ అభివృద్ధి పథంలో నడిచేది. కానీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనే అభివృద్ధి బాగా కనిపిస్తోంది. చంద్రబాబు పాలన చాలా బాగుంది. మోడీ కూడా ఎన్నో నిధులు కేటాయిస్తున్నారు. ఇద్దరి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వేగంగా జరుగుతోంది అని ప్రశంసలు కురిపించారు. అయితే వెంటనే ఆయన స్పష్టం చేస్తూ ఏదేమైనా తెలంగాణలో వచ్చే సీఎం మాత్రం కేసీఆరే అవుతారు. నేను తిరుమలలో కోరుకున్నది ఎప్పుడూ నెరవేరింది. కోరు కోకుండా ఎంపీ అయ్యాను, తర్వాత మంత్రి అయ్యాను, ఇప్పుడు ఎమ్మెల్యే అయ్యాను. ఇకపై నేను సీఎం కేసీఆర్ కోసం మొక్కుకున్నాను అని చెప్పారు.

**రాజకీయాల్లో చర్చనీయాంశం**

తెలుగుదేశం పార్టీ నుండి ఎంపీగా గెలుపొంది అనంతరం కెసీఆర్‌తో కలిసి పదవి కోసం బీఆర్ఎస్‌లో చేరిన మల్లారెడ్డి, తర్వాత మంత్రి పదవీని కూడా పొందారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో ఇంతవరకు చంద్రబాబు పేరు కూడా ఎత్తని ఆయన, ఇప్పుడు బాబు పాలనను ప్రశంసించడం, మొన్నటి వరకు మోడీపై విమర్శలు చేసిన ఆయన ఇప్పుడు మోడీని గొప్పలు చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

**విమర్శల వర్షం....**

మల్లారెడ్డి నేడు ఒకలా మాట్లాడతారు, రేపు అడిగితే వేరేలా చెబుతారు. ఆయన మాటలకు స్థిరత్వం లేదు అని. రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతూ మల్లారెడ్డి ఎక్కడ ఉన్నా, తన లాభం కోసం మాత్రమే మాట్లాడతారు. ఎవరినైనా ఎప్పుడైనా పొగడగలరు, విమర్శించగలరు. అదే ఆయన రాజకీయ స్టైల్ అని వ్యాఖ్యానిస్తున్నారు.

**ఎమోషన్‌లో కామెంట్లు**

మల్లారెడ్డి వ్యాఖ్యలు మరోసారి ఆయన రాజకీయ శైలినే బయటపెట్టాయి. ఎమోషన్‌లో ఏదో ఒకటి మాట్లాడే ఆయన మాటలు ఇప్పుడు తెలంగాణలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కూడా చర్చనీయాంశంగా మారాయి.

## ఉప్పరిపల్లిలో అంగన్‌వాడి కేంద్రాన్ని కలెక్టర్ మనుచౌదరి తనిఖీ



ఉప్పరిపల్లిలో అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ మనుచౌదరి, పాల్గొన్న అదనపు కలెక్టర్ రాధికగుప్తా, అధికారుల దృశ్యం

**శామీర్‌పేట, సెప్టెంబరు 9, ప్రభాతవార్త**

ఉప్పరిపల్లిలోని అంగన్‌వాడి కేంద్రాన్ని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని ఉప్పరిపల్లిలోని అంగన్‌వాడి కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తాతో కలిసి సందర్శించి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగ కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ చిన్నారులకు ఇచ్చే బాలామృతం, ఫౌష్టికాహారంను ఎంక్స్పైరీ డేట్‌ను పరిశీలించి జాగ్రత్తలు తీసుకుని ఆ డేట్ ముగిసేలోపు పిల్లలకు ఇవ్వాలని సంబంధిత అధికారులను, అంగన్‌వాడి టీచర్లను ఆదేశించారు. అవి అదనంగా ఉంటే మాత్రం వెంటనే వేరే కేంద్రాలకు ఇవ్వాలని జిల్లా సంక్షేమ అధికారికి సూచించారు. వంగగదిని, వంట సామాగ్రిని పరిశీలించి, గర్భిణీలకు, చిన్నారులకు ఏమి భోజనం ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడి కేంద్రంలో పిల్లలు ఆడుకునే ఆటవస్తువులను పరిశీలించి, ఎండ తగలకుండ పైన షెడ్ ఏర్పాటు చేస్తే పిల్లలు ఆడుకుంటారని సూచించారు. కేంద్రంలో పిల్లలు ఎంత మంది ఉన్నారని, గర్భిణీలు ఎంత మంది ఉన్నారని ఆరా తీశారు. పిల్లలకు ఏమైనా అవసరం ఉంటే ఏర్పాటు చేస్తామన్నారు. చిన్నారులతో ఆయన ముచ్చటించి చదివి వినిపించే ఆటలు, పాటలను కలెక్టర్ విన్నారు. భోజనం ఎలా ఉంటుందని, ఏ సమయానికి ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా, జిల్లా సంక్షేమ అధికారి శారద, మండల తహసీల్దార్ యాదగిరిరెడ్డి, తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, అంగన్‌వాడి టీచర్లు, పాల్గొన్నారు.

## ఎంఆర్‌సి కార్యాలయంలో ల్యాప్‌టాప్ చోరీ



చోరి జరిగిన ప్రదేశంలో పరిశీలిస్తున్న ఎస్ఐ

**పెద్దేముల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

గుర్తుతెలియని వ్యక్తులు ల్యాప్‌టాప్‌ను దొంగిలించిన సంఘటన పెద్దేముల్ మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వేణుకుమార్, ఆధార్‌సెంటర్ నిర్వహకులు శ్రీశైలం తెలిపిన వివరాల ప్రరారం.. పెద్దేముల్ మండలం జనగాం గ్రామానికి చెందిన శ్రీశైలంగత కొన్ని రోజులుగా ఆధార్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. సోమవారం ఆధార్ సేవలు అందించిన అనంతరం పనులు ముగిసాక ల్యాప్‌టాప్‌ను కార్యాలయంలోభద్రపరిచి ఇంటికి వెళ్ళాడు. యధావిధిగా మంగళవారం ఉదయం కార్యాలయానికి వచ్చి చూడగా అక్కడ ల్యాప్‌టాప్ కనిపించలేదు. కార్యాలయంలో ల్యాప్‌టాప్‌నువెతికిన కనిపించకపోవడంతో భాధితుడు పోలీసులకు పిర్యాదు చేశాడు. భాధితుడి పిర్యాదు మేరకు ఎస్ఐ వేణుకుమార్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. ల్యాప్‌టాప్‌ను ముందు భాగం కిటికిలొంచి దొంగిలించారు. తహసిల్దార్ కార్యాలయం, జూనియర్ కళాశాల బ్యాక్‌సైడ్, జిరాక్స్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఉన్నప్పటికి దుండగులు చోరికి పాల్పడడం గమనార్హం.

## బషీర్‌బేగ్ కుంట తూము మూసి వేత

**-చేపల పెంపకం కోసం అక్రమార్కుల పాగా**

**-నీట మునుగుతున్న పంట పొలాలు**

**-ఆందోళన చెందుతున్న మారెపల్లి గ్రామ రైతులు**

**-తమకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులకు మొర**



తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

**పెద్దేముల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

పెద్దేముల్ మండలం మారెపల్లితాండా శివారులో ఉన్న బషీన్‌బేగ్ కుంట తూమును కొందరు చేపల పెంపకం మూసివేసారు. దీంతో కుంట పూర్తిగా నిండి నీటి నిలువ ఉన్న వెనుక భాగంలో గల పంట పోలాలు నీట మునుగుతున్నాయని మారెపల్లి గ్రామ రైతులు బోయిని లక్ష్మమ్మ, బోయిని బాలమ్మ, భోయిని హన్మప్ప, చాపల రవిందర్, చాపల నర్సిములు, బోయిని రాఘవులు, బోయిని లస్మప్ప, ఆశప్ప తదితరులు ఆందోళనవ్యక్తంచేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం పెద్దేముల్ తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూమారెపల్లితాండా శివారులోని బషీర్‌బేగ్ కుంట సమీపంలోని 116 సర్వేనెంబర్‌లో సుమారు 15 మంది రైతులు తమ తాతల నాటి నుంచి ఉన్న భూమినిసాగుచేసి జీవనం కొనసాగిస్తున్నామని అన్నారు. అయితే మారెపల్లితాండాకు చెందిన కొందరు చేపల పెంపకం కోసం కుంట తూమును మూసివేసారు. దీంతో తమ భూములలో వర్షపు నీరు నిండా చేరి పంట పోలాలను సాగు చేసుకునేందుకు ఆస్కారం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అంతేగాకుండాతాండా నుంచి వచ్చె నీరు కూడా ఇదే కుంటలోకి రావడంతో తమ భూములన్ని నిండా నీటితో మునిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తమకు జీవనాధారమైన భూములు సాగుకు పనికిరాకుండా ఉండటంతో జీనవం కష్టతరమవుతోందని ఏకరువు పెడుతున్నారు. తాము నిరుపేద కుటుంబాలకు చెందిన పేద రైతులమని తమకు చెందిన అట్టి భూములను సాగుకు పనికొచ్చెలా చర్యలు తీసుకోవాలని అంటున్నారు. మూసి వేసిన కుంట తూమును తెరిచే విధంగా చర్యలు తీసుకొని తమకు న్యాయం జరిగే విధంగా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## వ్యక్తికి కత్తిపోట్లు.. చికిత్స పొందుతూ మృతి

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** ఇద్దరు కూలీల మధ్య గొడవ జరిగి ఒకరు కత్తిపోట్లకు గురికాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ బోయిగూడకు చెందిన చినగవని భాస్కర్ (27) నెలరోజుల క్రితం ఘట్‌కేసర్‌కు కూలీ పని కోసం వచ్చి అంబేద్కర్‌నగర్‌లో అద్దె గదిలో నివాసం ఉంటున్నాడు. పక్క గదిలో ఉంటున్న తోటి కూలీ సింగారం మణిదీప్ చిన్నపాటి విషయాలకు భాస్కర్‌తో గొడవపడుతుండేవాడు. ఈనెల 7వ తేదీన సాయంత్రం 6 గంటలకు ఏలాంటి కారణం లేకుండా భాస్కర్‌ను మణిదీప్ దుర్భాషలాడం ప్రారంభించగా వారితో పనిచేసే దాసు అనే వ్యక్తి జోక్యం చేసుకొని గొడవపడకూడదని వారిద్దరికి నచ్చజెప్పాడు. అదే రోజు రాత్రి 9 గంటలకు మణిదీప్ తిరిగి కావాలనే ఉద్దేశ్యంతో భాస్కర్‌ను దుర్భాషలాడగా ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి వాగ్వివాదం జరిగింది. దీంతో మణిదీప్ కత్తితో భాస్కర్ చాతీ, కడుపు కుడివైపున పొడిచాడు. గమనించిన దాసు అతని భార్య బాస్కర్‌ను ఘట్‌కేసర్ సామాజిక ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ రాత్రతి 11:20 గంటలకు భాస్కర్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

## గురుకులంలో తెలుగుభాషా దినోత్సవం

**నారాయణఖేడ్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో తెలంగాణ తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు పండితులు అయిన ప్రిన్సిపల్ రాములు, అశోక్, రమేష్, బుజ్జమ్మలను ఉపాధ్యాయబృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయులు యం.ఎ.ఖాదర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

**జోగిపేట, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:**
జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో మంగళవారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన అధ్యాపకులు మాట్లాడుతూ తెలుగుభాషా వైశిష్ట్యాన్ని విద్యార్థులకు తెలియచేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పండరి, శ్రీకాంత్, సంధ్య, శివకుమార్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను పెట్టుబడిదారులకు కట్టబెడుతున్న కేంద్ర ప్రభుత్వం

**-లేబర్ కోడ్స్ అమలుకు వ్యతిరేకంగా ఉద్యమం**
**-సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్**



సెమినార్‌లో మాట్లాడుతున్న జె.మల్లికార్జున్ తదితరులు

**నర్సాపూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
కార్మికుల హక్కులను పెట్టుబడిదారులకు కట్టబెడుతున్న కేంద్రప్రభుత్వంపై, కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తామని, డిసెంబర్ 7,9 తేదీల్లో మెదక్‌లో సిఐటియు తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలు నిర్వహిస్తున్నామని, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్ తెలిపారు. మంగళవారం నర్సాపూర్ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ విధానాలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై, కార్మికుల సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు, నాయకులు చెంద్రయ్య, నర్సింలు, పెంటయ్య, రుబ్లీ, పుష్ప, అనిత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలకవుల సమ్మేళనం


విజేతలకు బహుమతులను అందజేసిన ఉపాధ్యాయులు తదితరులు

**నర్సాపూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని నర్సాపూర్ సమీపంలోని విష్ణు ఉన్నతపాఠశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా బాలకవుల సమ్మేళనాన్ని సైతం నిర్వహించారు. ముందుగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వివిధపోటీలు నిర్వహించగా 7, 8 తరగతుల విద్యార్థులు తెలంగాణభాషపై నాట్యప్రదర్శన చేశారు. అంతేగాక యుకెజి నుండి రెండవ తరగతి విద్యార్థులకు వివిధ పోటీలు, 8,9,10 తరగతుల విద్యార్థులకు బాలకవి సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈపోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థులందరికి ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్‌ల చేతులమీదుగా బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమాన్ని తెలుగు ఉపాధ్యాయుడు ఉమాకాంత్, తులసి, సుజాత, రాధారాణి ఆధ్వర్యంలో విజయవంతంగా ముగిసింది. కార్యక్రమంలో ఉపాధ్యాయబృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లకు గుంత... ప్రయాణికులకు చింత

**-రోడ్డుపై గుంతలు ఉన్నాయి జాగ్రత్త**


మెదక్-చేగుంట రహదారి, కొర్విపల్లి శివారులో రోడ్డు మధ్యలో గుంత

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
అధికారుల నిర్లక్ష్యంవల్ల మండలంలోని ప్రధాన రహదారులన్నీ ధ్వంసమవుతున్నాయి. రోడ్లకు ఎక్కడికక్కడ గుంతలు పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నశంకరంపేట మండలపరధి కొర్విపల్లి వద్ద మెదక్-చేగుంట ప్రధానరహదారిపై పెద్ద గుంత ఏర్పడింది. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆగుంతలో నీళ్లు ఉండటంతో ఏదిగుంతో, ఏదిరోడ్డో ప్రయాణికులు తేల్చుకోలేకపోతున్నారు. మెదక్‌నుండి భాగ్యనగరానికివెళ్లే ప్రధానరహదారి కావడంతో రోజూ వందల మంది ప్రయాణిస్తూ ఉంటారు. పగలే ప్రమాదాలబారిన పడుతుంటే రాత్రి అయితే ప్రయాణించాలంటే జంకుతున్నారు. అలాగే చిన్నశంకరంపేట పట్టణం పద్మనాభస్వామిగుట్ట వద్ద, సంగాయపల్లి-మదూర్, రామాయపల్లి-ఖాజాపూర్ ప్రధాన రహదారి మధ్యలో అడ్డంగా రోడ్డును తవ్వి తూతూ మంత్రంగా మట్టినిపోశారు. అక్కడ గుంతలు ఏర్పడటంతో ఇటీవల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలబారిన పడ్డారు. అధికారులు స్పందించి వెంటనే గుంతలుపడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం మిషన్ శక్తి జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 10రోజుల ప్రత్యేక అవగాహన కార్యాక్రమంలో భాగంగా మంగళవారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించి న్యాయమూర్తి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంసథ కార్యదర్శి సౌజన్య విద్యార్థులకు జువెనైల్ జస్టిస్ యాక్ట్, పోక్సో యాక్ట్ తదితర బాలచట్టాలపై అవగాహన కల్పించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వివరించారు. విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలోపెట్టుకుని క్రమశిక్షణతో విద్యను అందుకోవాలన్నారు. పిల్లల వివాహ చట్టం, మహిళల రక్షణ చట్టాలపై అవగాహన పొంది ఉండాల్సిన అవసరం ఉందన్నారు. లింగ సమానత్వం, మహిళ సాధికారత సమాజ అభివృద్ధికి కీలమని న్యాయమూర్తి సౌజన్య సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ షేక్ ఇబ్రహీం, ఎస్ఐ నర్సింలు, ఎక్స్‌బిషన్ ఎస్ఐ దిలీప్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాకవి కాళోజీ సేవలు మరువలేనివి...

**-రామాయంపేట తహసీల్దార్ రజినికుమారి**


తహసీల్దార్ కార్యాలయంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**రామాయంపేట మున్సిపాలిటీ సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణరావు అని రామాయంపేట తహసీల్దార్ రజనికుమారి కొనియాడారు. ఆయన జయంతిని పురస్కరించుకొని రామాయంపేట మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రజినికుమారి మాట్లాడుతూ కాళోజీ కేవలం కవి మాత్రమే కాదు, సమాజాన్ని ఉద్ధరించేందుకు కలాన్ని ఆయుధంగా మార్చుకున్న యోధుడు అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, సమాజాన్ని పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపధ్యంలో ప్రజలు ఆరోగ్య పరిరక్షణపై దృష్టిపెట్టాలని సూచించారు. తాగు నీటిని కాచి, చల్లార్చి తాగడం ద్వారా జల వ్యాధులను నివారించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నవీన్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గౌస్ మొయినుద్దీన్, రూరల్ ఆర్ఐ గోపి, కార్యాలయ సిబ్బంది సుష్మ, రోజా, చంద్రకళ, సౌమ్య, మైసయ్య, కార్తీక్, రవి, పద్మ తదితరులు పాల్గొన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకొని పలువురు అధికారులు, ఉద్యోగులు కాళోజీ రచనలను సందర్శించి, ఆయన జీవిత విశేషాలను తెలియజేసే కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.

## నవసమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులు

**-జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్**

**పాపన్నపేట, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
ఉపాధ్యాయులు నవసమాజ మార్గదర్శకులని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. మంగళవారం పాపన్నపేటలో జరిగిన మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆదర్శవంతమైన సమాజాన్ని తయారు చేసే శక్తి ఉపాధ్యాయునికే ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పరిపూర్ణ వికాసవంతమైన విద్య అందుతుందని చెప్పారు. ఒత్తిడిలేని విద్య అందించే కేంద్రాలు సర్కార్ బడులేనని తెలిపారు.

**28మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు...**
పాపన్నపేట మండలస్థాయిలో విశిష్టసేవలు అందించిన 28మంది టీచర్లకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందించారు. వీరితోపాటు మండలం నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైన సాయిసిరికి, జిల్లాస్థాయికి ఎంపికైన సాయిలు, చంద్రశేఖర్, మల్లేశం, దుర్గాప్రసాద్‌లకు పురస్కారాల అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఓ ప్రతాప్‌రెడ్డి, డిఎస్‌ఓ రాజిరెడ్డి, హెచ్‌ఎంలు మహేశ్వర్, శ్రీనివాస్‌రావు, ఆరోగ్యం, పిఆర్టీయు నాయకులు రాజు, వెంకట్రాంరెడ్డి, టివిటిఎఫ్ నాయకులు బాల్రాజ్, ఎస్టీయు నాయకులు ఎల్లం, నాయకులు మంగ, నర్సింలు, టీచర్లు, అంజాగౌడ్ పాల్గొన్నారు.

## మాతృభాషను మరువవద్దు..

**-గెజిటెడ్ హెడ్మాస్టర్ శ్రీనివాసరావు**

**నారాయణఖేడ్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:**
మాతృభాషను మరువవద్దని, మాతృభాషతోనే మనుగడ సాధ్యమని గెజిటెడ్ హెడ్మాస్టర్ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నిజాంపేటలో తెలంగాణ ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని తెలంగాణభాషా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు సత్యనారాయణ, కాశీనాథ్ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సీనియర్ ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, దేవిసింగ్ గురూజీ, హరి, మారుతి, విజయ్‌కుమార్, నారాయణ భారతి, సుశీల, సురేఖ, మారుతి, సత్యనారాయణ, లక్ష్మణ్, వెంకటరెడ్డి, నరసింహులు, భ్రమరాంబ, నాగమణి విద్యార్థినీవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పాఠశాలలో పదవతరగతి చదువుతున్న సంధ్య అనే విద్యార్థిని తన తెలుగు ఉపాధ్యాయుని సహకారంతో రచించిన ఆటవెలది కవితలను చదివి వినిపించి సభికులను మెప్పించి ప్రశంసలు అందుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకొనగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది.

## ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మున్సిఫల్ అధికారులు, తదితరుల

**నర్సాపూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గురుకుల కళాశాలలో ప్లాస్టిక్ వ్యర్థాలు కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం 100రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి ఆదేశాలమేరకు మున్సిపాలిటీ పరిధిలోని గురుకుల కళాశాలలోని విద్యార్థులకు ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగంపై, నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్‌తోపాటు ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్, వార్డు అధికారులు ఉదయ్, రాములు, బేసిల్ ఫౌండేషన్ ప్రతినిధి విష్ణు, కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ బాలాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 13న లోక్ అదాలత్-ఎస్ఐ కోటేశ్వరరావు

**మనూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
ఈ నెల 13న నియోజకవర్గ కేంద్రమైన నారాయణఖేడ్‌లోని కోర్టులో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునే అవకాశం లోక్‌అదాలత్ ద్వారా కలుగుతుందని, అందుకు కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ కోటేశ్వరరావు మండల ప్రజలకు సూచించారు. లోక్ అదాలత్‌కు సంబంధించిన వివరాలను పోలీసు ఠాణాను సంప్రతించి తెలుసుకోవచ్చన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-రామాయంపేట ఎస్సై బాలరాజు..**

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
సైబర్‌నేరాల పట్ల ప్రజలు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని రామాయంపేట ఎస్ఐ బాలరాజు సూచించారు. నేటి డిజిటల్ యుగంలో సాంకేతికతను ఆయుధంగా మలుచుకున్న సైబర్‌నేరగాళ్లు కొత్తకొత్త పద్ధతుల్లో అమాయకులకు ఉచ్చు వేస్తున్నారని ఆయన హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు అప్రమత్తతే ప్రధాన రక్షణకవచమని సూచించారు. ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెట్ మోసాలు, యుపిఐ మోసాలు, లోన్ ఫ్రాడ్లు, నకిలీ వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ షాపింగ్ ఆఫర్లు వంటి మోసపూరిత పద్ధతులు ప్రస్తుతం విస్తరించి ఉన్నాయని ఆయన వివరించారు. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి యాప్‌ల ద్వారా పంపే ఎపికె ఫైళ్లు డౌన్‌లోడ్ చేస్తే మొబైల్ ఫోన్ మొత్తం నేరగాళ్ల నియంత్రణలోకి వెళ్లే ప్రమాదం ఉంది. సోషల్ మీడియాలో వస్తున్న పార్ట్‌టైమ్ జాబ్ ఆఫర్లకు స్పందించరాదు. ఒకవేళ మోసపోతే గోల్డెన్ అవర్‌లోనే చర్యలు తీసుకోవడం అత్యంత కీలకమని బాలరాజు హితవు పలికారు. దానికి గాను జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కు కాల్ చేయవచ్చని, లేదా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైం.జిఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో వెంటనే ఫిర్యాదు చేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపిడివో, ఎంఈఓ, తదితరులు

**నర్సాపూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలపరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానంచేశారు. సోమవారం నర్సాపూర్ మండలపరిషత్ కార్యాలయంలో మండల విద్యాధికారి తారాసింగ్ ఆధ్వర్యంలో ఆద్మాపూర్ యుపిఎస్ ప్రధానోపాధ్యాయులు రవిరాజ్ సహకారంతో మండల ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిడివో మధులత హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంపిడివో మధులత, మండలవిద్యాధికారి తారాసింగ్‌ల చేతులమీదుగా మండలంలోని 40మంది ఉత్తమ ఉపాధ్యాయులను షీల్డ్, సన్మానపత్రాలు ఇచ్చి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిఓ వైద్య శ్రీనివాస్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీస్త్రీలకు ప్రోటీన్ కిట్ల పంపిణీ

**-మాతృదేవోభవ పథకాన్ని నిరంతరం కొనసాగిస్తాం**
**-నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి**

**నర్సాపూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
గర్భిణీస్త్రీల ఆరోగ్యం కోసం మాతృదేవోభవ పథకంలో భాగంగా గర్భిణీలకు ప్రోటీన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని, ఈ మాతృదేవోభవ పథకాన్ని నిరంతరం కొనసాగిస్తామని కాంగ్రెస్‌పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి తన సొంత నిధులతో గర్భిణీస్త్రీల ఆరోగ్యరక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన మాతృదేవోభవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ రాజుయాదవ్, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్‌గుప్తా, మండల పార్టీ అధ్యక్షులు మల్లేశం, మాజీ ఎంపిపి లలిత నర్సింగ్‌నాయక్, కాంగ్రెస్ మండల వర్కింగ్‌ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్, నాయకులు రిజ్వాన్, అశోక్, సురేష్‌నాయక్, ఇలియాజ్, రవికుమార్, అశోక్, ఆంజనేయులుగౌడ్, హరీష్‌వర్ధన్, గోవింద్, సుధీర్‌గౌడ్ ఆయాగ్రామాల అంగన్‌వాడీలు, గర్భిణీలు పాల్గొన్నారు.

## జడ్పిహెచ్‌స్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు

**న్యాల్‌కల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
తెలుగు భాషా దినోత్సవం (ప్రజా కవి కాళోజి నారాయణరావు జయంతి)ని పురష్కరించుకుని మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలనుఎ ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాళోజి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురష్కరించుకుని విద్యార్థులు వేషాదారణతో చేపట్టిన సంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సచ్చిదానందరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి చైర్మన్ గార్లపల్లి మల్లేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సాంకేతికతతో వ్యవసాయంలో అద్భుత ఫలితాలు

**-జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్**



నానోయూరియా డ్రోన్ పిచికారీ అవగాహన కార్యక్రమం దృశ్యం

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తే రైతులు తక్కువ ఖర్చుతో, తక్కువ శ్రమతో అధిక దిగుబడులు సాధిస్తూ అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ తెలిపారు. మంగళవారం రామయంపేట మండలం, దామరచెరువు గ్రామ శివారులో రైతు శ్రీధర్‌రావు పొలంలో నానోయూరియా డ్రోన్ పిచికారీ అవగాహన కార్యక్రమం, క్షేత్ర ప్రదర్శనను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సంప్రదాయ యూరియాలో కేవలం 30 నత్రజని మాత్రమే పంటకు అందుతుంది, మిగతా పోషకాలు నీటిలో కలిసిపోవడం లేదా గాలికి ఆవిరైపోవడం వల్ల రైతులు ఎక్కువ మోతాదులో ఎరువులు వాడాల్సి వస్తుందని తెలిపారు. నానో యూరియా వాడకం ద్వారా ఎరువుల వినియోగ సామర్థ్యం పెరగడంతో పాటు రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. నానోయూరియా వినియోగంపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ విస్తృత ప్రచారం చేపడుతోందని, రైతులు ఈసాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా, డ్రోన్ టెక్నాలజీ వినియోగంపై మాట్లాడుతూ- డ్రోన్ పిచికారీ విధానంలో కేవలం 10లీటర్ల నీటితో 8నిమిషాల్లో ఒక ఎకరం పిచికారీ పూర్తవుతుందని, ఇది శ్రమను తగ్గించడంతో పాటు చీడపీడల నియంత్రణలో అత్యంత సమర్థవంతమైన పద్ధతిగా ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఇన్చార్జి సహాయ సంచాలకులు రాజనారాయణ, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శ్రీనివాస్, ప్రవీణ్, ఇఫ్కో ప్రతినిధి చంద్రబాబునాయుడు, ప్రాథమిక సహకార సంఘం సిఈవో నర్సింలు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

**హవేలీఘనాపూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
హవేలీఘనాపూర్ మండలపరిధిలోని దూప్‌సింగ్ తండావాసులకు లయన్స్‌క్లబ్ ఆఫ్ మెదక్ మంజీర ఆధ్వర్యంలో దాదాపు 70 కుటుంబాలకు మంగళవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భం జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ మెదక్ ఆధ్వర్యంలో మెదక్, కామారెడ్డి జిల్లాలో వరదలతో ఇబ్బందులుపడిన తండావాసులకు తమ క్లబ్ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో బసవేశ్వరరావు, గంప రమేష్, వైస్‌గవర్నర్ నర్సింహారాజు, ప్రవీణ్, పద్మావతి, సూర్యనారాయణ, రాయకంటి నాగరాజు, కిషన్‌గుప్త, లయన్స్ క్లబ్ మెదక్ మంజీరా అధ్యక్షులు వనపర్తి వెంకటేశం, కార్యదర్శి వెంకటరమణ, రాజు, నీలకంఠం, డాక్టర్ పి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ

**-దుబ్బాక పురపాలక కమిషనర్ కె.రమేష్‌కుమార్**



మొక్కలు నాటుతున్న దృశ్యం

**దుబ్బాక, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
మొక్కల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతలు వారే చేపట్టాలని దుబ్బాక పుర కమిషనర్ కే.రమేష్ కుమార్ సూచించారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం దుబ్బాక పట్టణశివారులోని దుంపలపల్లికి వెళ్లే చెరువు కట్ట రహదారిపై నిర్వహించిన "నాటుదాం ఒక మొక్క అమ్మ పేరు మీద" (ఏక్ పెడ్ మాకే నామ్) కార్యక్రమంలో ఆయన పాల్గొని, మొక్కలునాటారు. ఈ సందర్భంగా పురపాలికలో విధులు నిర్వహిస్తున్న 100 మందికి పైగా ఉద్యోగులు, సిబ్బంది ఒక్కొక్కరు ఒక్కో మొక్కను నాటి, వాటికి ట్రీగార్డులను అమర్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పురపాలికలోని అన్ని ప్రభుత్వపాఠశాలలో, ఇతర కార్యాలయాల్లో నేడు నాటేందుకు అవసరమైన మొక్కలను పురపాలిక కార్యాలయం నుంచే పంపిణీ చేశామన్నారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని, చెట్టే జీవరాశి మనుగడకు ఆధారమని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో పురపాలిక మేనేజర్ శ్రీనివాస్, సీనియర్ అకౌంటెంట్ అనిల్‌రెడ్డి, వార్డు అధికారులు, మెప్మా ఆర్పీలు, పుర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు తరాలను కాపాడుకుందాం

**-తూంకుంట నర్సారెడ్డి**


మొక్కనునాటి నీళ్లు పోస్తున్న తూంకుంట నర్సారెడ్డి

**గజ్వేల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని తల్లి పేరిట ఒక మొక్క నాటాలనే వినూత్న కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రజలు భాగస్వామ్యం చేస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, ఎఎంసి వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, ఎఎంసి కార్యదర్శి జాన్ వెస్లీతో కలిసి మొక్కలునాటారు. కార్యక్రమంలో సుఖేందర్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, కరుణాకర్‌రెడ్డి, వహీద్, నరసింహారెడ్డి, అక్కారం యాదగిరి, నర్సాగౌడ్, హరినాథ్, ఉప్పల శ్రీను, రామాగౌడ్, భానుప్రియ, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోవాలి

**కంగ్టి, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
కంగ్టి మండలంలోని రాజారామ్ తాండ గ్రామంలో వైరల్ ఫీవర్ వ్యాప్తి చెంది ప్రజలు బాధపడుతున్నారు. దాంతో మంగళవారం తుర్కవడగం సబ్ సెంటర్ వైద్యాధికారి సంగమేష్ బృందం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరికి వైద్యచికిత్సలు, వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నారు. ఈమేరకు ఆరోగ్య మెళుకువలపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. అవగాహనలో భాగంగా గత వారాంతం నుండి భారీగా కురిసిన వర్షానికి, కొత్తగా నీరు రావడంతో, ఇలాంటి వ్యాధులు వస్తున్నాయని, ప్రతి ఒక్కరు త్రాగే నీళ్లను వేడిచేసి, చల్లారిన తరువాత త్రాగాలని, కుళాయి నీరు పరిశుభంగా ఉంచుకోవాలని, ఇంటిచుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాజుపవార్, మాజీ సర్పంచ్ పల్లవి పరశురాం, మాజీ ఎంపిటిసి సాలిబాయి గంగారాంలు తమ ఆరోగ్యం పరీక్షలు చేసుకుని మాత్రలు తీసుకున్నారు, కార్యక్రమంలో ఎఎన్‌ఎం శ్రీలత, ఆశ సంగీత తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలతోపాటు తల్లి అదృశ్యం


పిల్లలతో పాటు అదృశ్యమైన తల్లి భవానితోపాటు ఇద్దరుపిల్లలు

**నర్సాపూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**
కన్న పిల్లలతోపాటు తల్లి అదృశ్యమైన సంఘటన నర్సాపూర్ మండల పరిధిలోని నారాయణపూర్‌గ్రామంలో చోటుచేసుకుంది. ఈసంఘటన వివరాలు ఎస్సై లింగం కథనంప్రకారం ఇలా ఉన్నాయి. మండలపరిధిలోని నారాయణపూర్‌గ్రామానికి చెందిన మాణిక్యరాజుకు సికింద్రాబాద్ బాలాజీనగర్‌కు చెందిన భవానితో 8సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కాజు ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడని తెలిపారు. వీరికి ఒకపాప లోకేశ్వరి (4), బాబు అనిరుద్(1) ఉన్నారు. కాగా ఐదు నెలల క్రితం భార్యాభర్తలు గొడవపడగా భార్య భవాని తన పుట్టింటికి వెళ్ళిపోయింది అని తెలిపారు. ఈనెల 8న తల్లిదండ్రులు, పెద్దలు నచ్చజెప్పి భార్య భవానిని అత్తగారిల్లైన భర్త రాజు వద్ద ఉంచివెళ్లారు. ఈక్రమంలో ఈనెల 9న మంగళవారం బాబుకు జ్వరంవచ్చిందని భార్యాభర్తలతోపాటు అత్త, ఆడబిడ్డ కూడా అందరుకలిసి నర్సాపూర్ ఆసుపత్రిలో చూపించడానికి వచ్చారు. వీరిని ఆసుపత్రిలోనే ఉంచి భర్త రాజు ఆటో నడుపుకోవడానికి వెళ్ళిపోయాడని తెలిపారు. ఈక్రమంలో భార్య భవాని ఓపి చీటీ తీసుకొస్తానని అత్త, ఆడబిడ్డతో చెప్పి పిల్లలతోపాటు వెళ్ళిందన్నారు. ఎంతసేపటికీ భవాని తిరిగి అత్తవద్దకురాలేదని తెలిపారు. విషయం తల్లిద్వారా తెలుసుకున్న రాజు వెంటనే ఆసుపత్రికి వచ్చి చుట్టుపక్కల బంధువుల వద్ద ఎంత వెదికినా భార్య భవాని, పిల్లల ఆచూకీ తెలియలేదు. దీంతో నర్సాపూర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. భర్త మాణిక్యరాజు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.లింగం తెలిపారు.

# ఘనంగా కాళోజి నారాయణరావు జయంతి

## మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి



కలెక్టరేట్‌లోకవితామూర్తికాళోజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ మనుచౌదరి,పాల్గొన్న అదనపు కలెక్టర్ రాధికగుప్తా, జిల్లా అధికారులు



కాళోజి జయంతి వేడుకలలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



దౌల్తాబాద్‌లో. కాళోజీ వేడుకలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 9, ప్రభాతవార్త**

ప్రజల కోసం నిత్యం పరితపించిన కవితామూర్తి కాళోజి ఆశయాలు భవిషత్ తరాలకు ఆదర్శమని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో కవితామూర్తి కాళోజి జయంతి సందర్భంగ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కలెక్టర్,అదనపు కలెక్టర్, జిల్లా అధికారులు నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ తెలంగాణ మాండలికానికి నిలువుటెత్తు నిదర్శనం కాళోజి అని అన్నారు. పుట్టుక నీది, చావునీది, బతుకంతా దేశానిది అన్న కాళోజి మాటలు అందరికి ఆదర్శమని అన్నారు. తెలంగాణ యాస,భాష ఎంత మంచిగుంటుందో రాసి మరీ చూపించారని కలెక్టర్ గుర్తు చేశారు. ° జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా, డిఆర్ఓ హరిప్రియ, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**పెద్దేముల్‌లో..**

**పెద్దేముల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త**: తెలుగు భాష పరిరక్షణకు కాళోజి స్ఫూర్తి అని కవయిత్రి మొల్ల కళావేదిక పౌండర్ అధ్యక్షులు కె.వెంకట్ అన్నారు. మంగళవారం కాళోజి జయంతిని పురస్కరించుకొని పెద్దేముల్ జిల్లా పరిషత్ పాఠశాల ( బాలికల)లో తెలుగు భాష దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన కె,వెంకట్ మాట్లాడుతూ కాళోజి నారాయన్‌రావు కేవలం కవి మాత్రమే కాదని, ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, సమాజ మార్పు కోసం కలం పట్టిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. ఆయన తెలుగు భాష సంస్కృతికి చేసిన సేవలు అపారమైనవని, యువత కాళోజిస్ఫూర్తిని అనుసరించి మాతృభాషకు ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. జిహెచ్ఎం అక్కమహాదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకొని భవిషత్తులోఉన్నతంగా రాణించి గ్రామానికి, పాఠశాలకు, తల్లిదండ్రులకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. పాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**దౌల్తాబాద్‌లో..**

**దౌల్తాబాద్,సెప్టెంబర్ 9,ప్రభాతవార్త**: దౌల్తాబాద్ మండలంలోని మండలపరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాలలో మంగళవారంరోజు ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సంధర్భంగా ప్రదానోపాధ్యాయులు వెంకటయ్య మాట్లాడుతూ...తెలంగాణలోని ప్రతీ గ్రామంలో ఒక గ్రంథాలయం ఉండాలన్నది కాళోజి నారాయణరావు ఆకాంక్ష అని అన్నారు.విద్యార్థి దశలోనే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలను ఉల్లంఘించి వరంగల్‌లో గణపతి ఉత్సవాలు నిర్వహించారని,తెలంగాణలో అక్షరజ్యోతిని వ్యాపింప జేయాలన్న తపనతో ఆంధ్ర సారస్వత పరిషత్‌ను స్థాపించిన ప్రముఖులలో కాళోజి ఒకరని అన్నారు.తెలంగాణ ప్రభుత్వం కాళోజి జన్మదినాన్ని తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవించిందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సాయిలుగౌడ్,రేణుక,చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**కొడంగల్‌లో జయంతి వేడుకలు**

**కొడంగల్ రూరల్, సెప్టెంబరు 9 (ప్రభాతవార్త:** కొడంగల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇబ్రహింపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ సహాయ ఆచార్యులు డాక్టర్ చింతల రాకేశ్ భవానీ హాజరై కాళోజీ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. పుట్టుక, చావులు కాకుండా బతుకంతా తెలంగాణ కోసమే ఉద్యమించిన మహా వ్యక్తి అని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి ఆయనను అధ్యాపకులతో కలిసి సన్మానించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల చేయూత



**కేశంపేట సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:**

కేశంపేట మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో గ్రామానికి చెందిన కర్రోళ్ల రాములమ్మ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. విషయాన్ని కాకునూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కేశంపేట తాజా మాజీ జడ్పిటిసి విశాలా శ్రవణ్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించిన ఆమె గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుల ద్వారా మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయంగా 5000 వేలు రూపాయలు, గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు 6000 వేల రూపాయలు మొత్తంగా 11 వేల రూపాయలను మంగళవారం మృతురాలి కుమారుడు కర్రోల జంగిలి కి అందజేశారు. ఈ సందర్భంగా మృతురాలి కుమారుడు మాట్లాడుతూ తమ ఆర్థిక పరిస్థితిని గ్రహించి తమ కుటుంబానికి అండగా నిలిచిన మాజీ జడ్పిటిసి విశాల శ్రవణ్ రెడ్డి కి, అందుకు సహకరించిన గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులకు మృతురాలి కుమారుడు జంగిలి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ జట్టూరి నాగిరెడ్డి, తాజా మాజీ ఉపసర్పంచ్ తైద పర్వతాలు, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీశైలం, కిసాన్ సెల్ కేశంపేట మండల అధ్యక్షుడు కోడూరు రాములు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోడూరు నర్సింలు, ఎదురె మల్లేష్, మాజీ వార్డు సభ్యుడు పంది లింగం, చెట్టేమోని నరసింహ ముదిరాజ్, గోపని భీమయ్య, తాళ్ల నర్సింలు గౌడ్, డోల్ రాజు, బుడ్డ రామచంద్రయ్య, కోడి గంటి శాంతయ్య, ఎర్ర నర్సింలు, కర్రోల్ల నర్సింలు, కడుపు అంజయ్య, సొంటె మల్లేష్, పల్లె శివశంకర్, గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మేకల దొంగతనం...కేసు నమోదు

**జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబర్ ,9, (ప్రభాతవార్త)**: గుర్తు తెలియని వ్యక్తులు చేసిన మేకల దొగతనంపై జిల్లెడు చౌదరిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ విజయ్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని జిల్లెడు గ్రామానికి చెందిన గడ్డం శాంతయ్య తన వ్యవసాయ పొలంలో 40మేకలను పోషిస్తున్నాడు. అయితే ఎప్పటి లాగానే శాంతయ్య తన పొలంలో షెడ్డులో మేకలను వదిలి ఆదివారం రాత్రి ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం వెల్లి చూడగా ఎనిమిది మేకలు లేనట్లు గమనించాడు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**శామీర్‌పేట, సెప్టెంబరు 9, ప్రభాతవార్త**

శామీర్‌పేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హరిబాబు అనే యువకుడు మృతిచెందారు. ఈ రోడ్డు ప్రమాద సంఘటన నల్సార్ చౌరస్తా వద్ద జరిగింది. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం శామీర్‌పేట గ్రామానికి చెందిన పర్వతపురం హరిబాబు (35) తన ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగ సోమవారం రాత్రి 10గంటల సమయంలో తూంకుంట వైపున నుంచి మజీద్‌పూర్ వైపు వెళ్తున్న ఒక బొలోరో వాహనం టిఎస్08యుజి3283గలది అతివేగంగా నిర్లక్ష్యంగా డ్రైవర్ నడుపుతూ వెళ్తూ హరిబాబు వెళ్తున్న మోటర్‌సైకిల్‌ను బొలోరో వాహనం ఢీకొన్నట్లు తెలిపారు. దీంతో ఆ బొలోరో వాహనం సుమారు 20మీటర్ల దూరం వరకు బైక్‌ను లాగుతూ వెళ్లి రోడ్డుపక్కన ఉన్న పార్కును ఢీకొని ఆగిపోయినట్లు తెలిపారు. ఆ ప్రమాదం తరువాత బొలోరో డ్రైవర్ వాహనం వదిలి పారిపోయినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాద సంఘన సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు చేరుకోగా హరిబాబు బొలోరో కింద నలిగిఉన్నట్లు తెలిపారు. అయితే వెంటనే 108అంబులెన్స్‌కు సమాచారం అందించగ సిబ్బంది చేరుకుని పరిశీలించగ హరిబాబు అప్పటికే మృతిచెందినట్లు ధృవీకరించారని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదానికి కారణమైన బొలోరో డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## బోరంచ జడ్పిహెచ్ఎస్‌లో తెలుగుభాషా దినోత్సవం

**మనూర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని బోరంచ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో తెలుగు బోధిస్తున్న ఉపాధ్యాయులతో పాటు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డివిజన్ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన బోరంచ జడ్పిహెచ్ఎస్‌లో పీడిగా విధులు నిర్వహిస్తున్న రవికుమార్, మండల ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న అశోక్‌లను కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బైండ్ల కృష్ణ ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా బైండ్ల కృష్ణ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఆనదంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు మహేష్‌కుమార్, సిహెచ్ నరసప్ప, అశోక్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జడ్పిహెచ్ఎస్‌లో తెలుగుభాషా దినోత్సవం

**చౌటకూరు, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కోర్పల్ గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో మంగళవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జన్మదినాన్ని పురస్కరించు కుని తెలుగుభాషా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు ఘనంగా జరుపు కున్నారు. కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నిర్వహిం చారు. తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు సమాజాభివృద్ధికి అందచేసిన సేవలను కొనియాడారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.అడివప్ప, ఉపాధ్యాయులు మొగు లయ్య, మాణెయ్య, బి.శ్రీనివాస్, నాగరాజు, యాదగిరి, తిరుపతిరెడ్డి, ఓంప్రకాష్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ముకుందం, సంజయ్‌కుమార్, మల్లేశం, పంచాయతీ కార్యదర్శి, పాఠశాల మాజీ విద్యాకమిటీ చైర్మన్ రాజకుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## చాకరిమెట్ల ఆలయ హుండీ లెక్కింపు

**శివ్వంపేట, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

మండలంలోని చిన్నగొట్టిముక్కల గ్రామశివారులోగల ప్రసిద్ధ పుణ్యక్షేత్ర మైన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం నిర్వహించారు. 6నెలల హుండీ లెక్కించగా 6లక్షల42వేల 43రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ తెలిపారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, గ్రామస్థులు నారాయణ రావు, నర్సింగరావు, కిషన్‌రావు, చంద్రయ్యరావు, ఆలయసిబ్బంది రామకృష్ణ, ప్రకాష్‌చారి, శివకేశవ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డుపై చెరువు నీరు-ముందుకు పోయేదెలా

**-ఇబ్బందులు పడుతున్న వడ్డి, డప్పూర్ గ్రామస్థులు**

**న్యాల్‌కల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని వడ్డి-డప్పూర్ గ్రామాల శివారులోని డప్పూర్ వాగు నీరు రోడ్డుపైకి చేరడంతో అటుగా ప్రయాణించే ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై కల్వర్టు వద్ద నీరుచేరడంతో అటుగా ద్విచక్ర వాహనంపై ప్రయాణించేందుకు వాహనచోదకులు భయాందోళనలకు గుర వుతున్నారు. నిత్యం ఈదారి గుండానే డప్పూర్, వడ్డి గ్రామాల రైతులు పొలాలకు వెళుతుంటారు. రోడ్డుపై నిల్చున్న నీటి గుండా రోడ్డు దాటేందుకు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## పంటల వివరాల నమోదు

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ముక్తాపూర్, మావినెల్లి, గౌడ్గం జన్వాడ గ్రామాల్లో రైతులు సాగు చేసుకుంటున్న పంటల వివరాలను ఏఈఓ వినయ్ మంగళవారం నమోదు చేస్తున్నారు. రైతులు సాగు చేసుకుంటున్న పంటలను పరిశీలించడంతో పాటు ఈ క్రాప్ బుకింగ్ పోర్టల్‌లో అప్‌డేట్ చేస్తొన్నారు. రైతులు తాము సాగు చేసుకుంటున్న పంటల వివరాలను విధిగా నమోదు చేసుకోవాలని, పంట చేతికి అందాక మార్కెట్‌లో విక్రయించుకునే సందర్భంలో పంటల వివరాలను నమోదు చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని, అందుకు పంటల వివరాలను నమోదు చేసుకోవాలని ఏఈఓ వినయ్ సూచించారు.

## మాజీ ఎమ్మెల్యేను కలిసిన యువనాయకులు

**మెదక్ టౌన్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా వారి నివాసం కొంపల్లిలో మంగళవారం కలిసిన యువ నాయకులు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత ముందంజలో ఉండాలని కలిసికట్టుగా పనిచేసి మెదక్ జిల్లాలోని అన్ని జెడ్పిటిసి ,ఎంపిటిసి సర్పంచ్ ,జిల్లా పరిషత్ ,స్థానాలను కైవసం చేసుకోవాలని బలంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ ఏ పిలుపు ఇచ్చిన కష్టపడి పనిచేయాలని తెలిపారు. ఇందుకు యువ నాయకులు మాట్లాడుతూ పార్టీ ఏ పిలుపు ఇచ్చిన కష్టపడి పనిచేయాడానికి సిద్ధంగా ఉన్నామని పద్మక్క తోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కాసాపురం కిరణ్ ,నిజ్జని వినయ్ ,సుడ ప్రసాద్ ,మిట్టపల్లి మధు సంగేపుల్ల రాకేష్ , గుట్ట అక్షయ్ ,దాకూరి అర్జున్ కందనూరి రాహుల్ గౌడ్, కొత్తపల్లి దినేష్ ,బండ హరి శంకర్ పాల్గొన్నారు.

## ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

**చౌటకూరు, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

ఉమ్మడి పుల్‌కల్ మండలంలో ప్రజాకవి విభూషణ్ కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మండల పరిషత్, రెవిన్యూ కార్యాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాళోజీ చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండల కేంద్రమైన చౌటకూరులో తహసీల్దార్ అనుదీప్ రెవిన్యూ సిబ్బందితో కలిసి కాళోజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సందీప్‌గౌడ్, జూనియర్ అసిస్టెంట్ శైలజయాదగిరి, పురుషోత్తం పాల్గొన్నారు.

## పార్టీ కార్యక్రమాలు విజయవంతం చేయాలి

**-బిజెపి అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్**

**మెదక్ టౌన్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

సేవ పక్షం కార్యశాలను మెదక్ బిజెపిపార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ పార్లమెంట్ కోకన్వీనర్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ సెప్టెంబర్ 17న ప్రధాని నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు సేవ పక్షం కార్యశాలలో భాగంగా రక్తదాన శిబిరం జిల్లా అన్ని మండలాలు, మున్సిపాలిటీలలో నిర్వహించాలని తెలిపారు. ఒక్కో రక్తదాన శిబిరంలో కనీసం 75యూనిట్లు తగ్గకుండా నిర్వహించాలని తెలిపారు. ఆత్మ నిర్భర భారత్, వికసిత్ భారత్ అంశాలపై, మహిళా మోర్చా ఆధ్వర్యంలో అసెంబ్లీలో స్థాయిలో చిత్రలేఖనం నిర్వహించాలని అన్నారు. స్వచ్ఛభారత్, శక్తికేంద్రం, మండలకేంద్రంలో స్వచ్ఛభారత్ చేయడానికి ముందు పరిసరాల ఫోటో, స్వచ్ఛభారత్ నిర్వహించిన తర్వాత పరిసరాలఫోటో, చిన్న వీడియో లు తీసి ఈకార్యక్రమాలకు స్థానిక సెలబ్రిటీలను ఆహ్వానించాలని అన్నారు. నమో మారథాన్, యువమోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో 23కిమీ నిర్వహించాలని అన్నారు.కార్యక్రమంల్లో యువత, విద్యార్థులను భాగస్వా మ్యం చేయాలని అన్నారు.జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, సంఘసాని సురేష్, ఈర్ల రంజిత్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చేష్‌యాదవ్, రాజేందర్, శంకర్ గౌడ్, జనగాం ప్రబారి నందారెడ్డి, జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, అసెంబ్లీ కన్వీనర్ మధుసూదన్, జిల్లా యువమోర్చా అధ్యక్షులు సతీష్, జిల్లా మహిళామోర్చా ప్రధానకార్యదర్శి కవితారెడ్డి పాల్గొన్నారు.

## ఆచార్య కళాశాలలో ఘనంగా కాళోజి జయంతి

**జహీరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

జహీరాబాద్ పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో మంగళారం ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతిని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కాళోజీ నారాయణ రావు చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల హరికుమార్ పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం.వెంటకరామిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నందుగౌడ్, నర్సింలు, దత్తు, నిఖిత, దీపిక, నవీన, లావణ్య, కీర్తి, శ్రావణి, జగదేవి, సురేష్ తదితరులు పాల్గొనగా తెలుగు అధ్యాపకులు ఎం.రమేష్‌ను ప్రిన్సిపాల్, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

## కాళోజీ సేవలు చిరస్మరణీయం

**మెదక్ టౌన్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు సేవలు చిరస్మరణీయమని డిఆర్ఓ భుజంగరావు అన్నారు. మంగళవారం కాళోజీ జయంతిని పురస్కరించుకొని జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయన కాళోజీ వ్యక్తిత్వం గురించి మాట్లాడారు. ఆయన రచనలు ప్రజాస్వామ్య, నైతిక విలువలకు ప్రతిరూపమని పేర్కొన్నారు. యువత ఆయన ఆలోచనలనుంచి ప్రేరణ పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏవో యూనస్ సంబంధిత అధికారులు పాల్గొని నివాళులు అర్పించారు.

## ఆర్ఓబి బాధితులకు టిడిఆర్‌తో న్యాయం చేద్దాం

**-కూల్చివేతలకు సహకారం..రోడ్డు వెడల్పుకు మార్గం చేయిస్తున్న వజ్రేశ్‌యాదవ్ తదితరులు**



**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వేవంతెన పనులు వేగవంతం చేసేందుకు కోర్టును ఆశ్రయించిన 11 మంది బాధితులకు మున్సిపల్ నుంచి టీడీఆర్ మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేశ్‌యాదవ్ తెలిపారు. ఘట్‌కేసర్ పట్టణంలో మంగళవారం ఆయన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్‌ల ఆధ్వర్యంలో ఆర్ఓబీ బాధితులను కలుసుకొని నష్టపరిహారంపై చర్చించారు. ప్రభుత్వం భూసేకరణ చట్టం ప్రకారం అందించిన నష్టపరిహారం తీసుకోకుండా కోర్టును ఆశ్రయించిన 11 మంది బాధితుల్లో కొమ్మిడి సత్యనారాయణరెడ్డి, నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, నర్సింహ్మారెడ్డిలు కాంగ్రెస్ నేత కొమ్మిడి శివప్రదీప్‌రెడ్డి చొరవతో తమ కట్టడాలను కూల్చివేసేందుకు మందుకు రావడంతో వజ్రేశ్‌యాదవ్ సమక్షంలో జేసీబీతో కూల్చివేతలు చేపట్టారు. వంతెనకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలు తొలగించడం ద్వారా రోడ్డు వెడల్పుచేస్తే ఆర్టీసీ బస్సుల రాకపోకలకు అవకాశం కల్గుతుందని ఆయన తెలిపారు. దశాబ్దంకు పైగా వంతెనకు సేకరించిన ఇళ్లు, దుకాణాలు కూల్చివేయక వంతెన పనులు పూర్తి కాగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, బస్సులు రాక ప్రయాణికులు బైపాస్ రహదారికి వెళ్లడానికి అవస్థలు పడాల్సీ వస్తుందని బాధితులు సహకరించడం ద్వారా టీడిఆర్ ఇప్పించి కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించి హెచ్ఆర్‌డిసిఎల్ ద్వారా రోడ్డు అభివృద్ధి చేయిస్తామని తెలిపారు. మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరక్టర్ చిల్కూరి మచ్చేంధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ, జేపీసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి, సొసైటీ మాజీ డైరక్టర్ బొక్క ప్రభాకర్‌రెడ్డి, డిసిసి కార్యదర్శి ఉల్లి అంజనేయులు, మైసమ్మగుట్ట మాజీ చైర్మన్ మామిండ్ల చిత్తారియాదవ్, మాజీ వార్డుసభ్యులు సల్లూరి నర్సింగ్‌రావు, నానావత్ సురేశ్‌నాయక్, మున్సిపల్ ఉపాధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, నాయకులు కొమ్మిడి శివప్రదీప్‌రెడ్డి, ఎం.ఎ.ఫారూఖ్, మోత్కుపల్లి శ్రీనివాస్, ఎం.అబ్దుల్‌ఖయ్యూమ్, బొక్క సత్తిరెడ్డి, మానుక కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు పండ్లు పంపిణీ



**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:**

పోచారం మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మందాడి సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం నీలిమ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రేడ్డు ప్యాకెట్లు పంపిణీ చేశారు.బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు తప్పితే ప్రస్తుత కాంగ్రెస్ హయంలో చేపట్టిన అభివృద్ధి కనిపించడం లేదని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆధ్వర్యంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని రాబోయే రోజుల్లో రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. పార్టీ మున్సిపల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, పార్టీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్, మాజీ బీఆర్ఎస్ కౌన్సిలర్ సింగిరెడ్డి సాయిరెడ్డి, మెట్టు బాల్‌రెడ్డి, బి. హరిప్రసాద్‌రావు, సుర్వీ రవీందర్ గౌడ్, నాయకులు అబ్బవతి నర్సింహ, మోటుపల్లి శ్రీనివాస్, బోయపల్లి సత్తిరెడ్డి, దాసరి శంకర్, జితేందర్ నాయక్, కేఎం. రెడ్డి, బోయపల్లి రాజేశ్వర్‌రెడ్డి, సామల సందీప్ రెడ్డి, పి.లక్ష్మీ, జవాజీ అశోక్, కొమ్ముల ప్రశాంత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు కుక్కలకు రేబిస్ వాక్సిన్ల శిబిరం

**మేడ్చల్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త ః** మేడ్చల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో కేఎల్ఆర్ వెంచర్‌లోని శివాజీ విగ్రహం వద్ద నేడు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు బ్లూ క్రాస్ వారిచే పెంపుడు కుక్కలకు ఉచిత వాక్సినేషన్ శిబిరం నిర్వహించబడుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీ చంద్ర ప్రకాష్ తెలిపారు. ఈ శిభిరంలో కుక్కలకు రెబీస్‌తో పాటు ఇతర వ్యాధుల నుండి రక్షణ కల్పించే వ్యాక్సిన్లు ఇవ్వబడతాయని తెలిపారు. పెంపుడు కుక్కలను కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ పెంపుడు జంతువుల వ్యాక్సిన్లి ఇప్పించి వాటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.

## బిజెపి ప్రధానకార్యదర్శులను కలిసిన సుదర్శన్‌రెడ్డి



**ఘట్‌కేసర్, సెప్టెంబర్9,ప్రభాతవార్త:** భారతీయ జనతాపార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శులుగా నియమితులైన గౌతంరావు, తూళ్ల వీరేందర్‌గౌడ్, వేముల అశోక్‌లను మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి కలిశారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించగా ముగ్గురు సీనియర్ నాయకులు రాష్ట్ర ప్రధానకార్యదర్శులుగా నియమితులు కావడంతో సుదర్శన్‌రెడ్డి వారిని హైదరాబాద్‌లలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. బిజెపి బలోపేతానికి నూతనంగా ప్రకటించిన కార్యవర్గం కృషి చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## కారు ఢీకొని మహిళ మృతి

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** రహదారి దాటుతున్న ఓమహిళను వేగంగా వచ్చిన కారఉ ఢీకొట్టగా తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. సిద్దిపేట్ జిల్లా జగదేవ్‌పూర్‌కు చెందిన దాచారం మల్లమ్మ (77) సోమవారం ఉదయం ఇంటి నుంచి బయలు దేరి బీబీనగర్ మండలం నెమురగోముల గ్రామానికి వెళ్తూ అవుషాపూర్‌కు బస్సులో వచ్చి దిగింది. జాతీయరహదారిపై ఎస్‌పిఆర్ స్కూల్ వద్ద రహదారి దాటుతుండగా స్విఫ్ట్‌డిజైర్ కారు (టిఎస్08హెచ్‌టి-7813) భువనగిరి వైపుకు అతివేగంగా వచ్చి ఆమెను ఢీకొట్టింది. దీంతో మల్లమ్మ తలకు తీవ్ర రక్తగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. మహిళ ఢికొట్టిన కారు ముందు వెళ్తున్న యూనికాన్ బైక్ (టిఎస్27-8184)ను కూడా ఢీకొట్టగా బైక్ మీద వెళ్తున్న వ్యక్తి తీవ్ర గాయమైంది. రోడ్డుప్రమాదంలో మృతిచెందిన మల్లమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించామని కారు అజాగ్రత్తగా నడిపి మహిళ మృతికి, మరోకరి గాయాలకు కారణమైన చిలుకమారి సుదర్శన్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

## నిరుపయోగంగా పశువుల తాగునీటి తొట్టెలు



**మంచాల సెప్టెంబర్ 9 ప్రభాతవార్త**

మంచాల మండలం దాద్ పల్లి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా పశువుల తొట్టిలు నిరుపయోగంగా ఉంది. మరొక పశువుల తొట్టి పగిలిపోగా మరమ్మ తులకు కూడా నోచుకోలేదు. రెండు నీటి తొట్టిలు వినియోగంలో లేకపోవడంతో గ్రామంలో ఉన్న మూగజీవాలకు తాగడానికి నీరు లేక పశువులు గొంతెండి పోతున్నాయి. పశువులకు కనీస అవసరమైన నీటి తొట్టెలు వినియోగంలో లేకపోవడం అధికారుల అలసత్వానికి నిదర్శనమని గ్రామస్థులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు మేల్కొని నీటి తొట్టెలను సిద్ధం చేయాల్సిందిగా కోరుతున్నారు.

## జాతీయస్థాయికి దూసుకెళ్లిన జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు



**కొత్తూరు సెప్టెంబర్ 9 ప్రభాతవార్త :**

హైదరాబాద్ మియాపూర్‌లోని క్రీడో ఇంటర్నేషనల్ పాఠశాలలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి చౌక్బాల్ పోటీలలో కొత్తూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచారు. పీఎం శ్రీ జెడ్పిహెచ్ఎస్ కొత్తూరు నుంచి 9వ తరగతి విద్యార్థులు అచ్చిత, శ్రీలక్ష్మి మరియు 10వ తరగతి విద్యార్థిని శ్రీజ రాష్ట్రస్థాయి పోటీలో మెరిసి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ పోటీలు విశాఖపట్నంలో ఈనెల 26 నుంచి 28 వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి అంగూర్ నాయక్ విద్యార్థులను అభినందించగా, వ్యాయామ ఉపాధ్యాయురాలు జి.నవనీత వారిని ప్రత్యేకంగా శ్లాఘించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విజయాన్ని గర్వంగా భావిస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రవికుమార్, భగవంతు,శ్రీనివాసులు రి. రాజు ,లు పాల్గొన్నారు.అలాగే ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియచేశారు.

## ఆరుట్లలో సిసి రోడ్డు పనులు ప్రారంభం



**మంచాల సెప్టెంబర్ 9 ప్రభాతవార్త**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో గ్రామం నుండి జాపాల్ కి 10 లక్షల నిధులతో మంగళవారం సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మంచాల మండల సహకార సంఘం చైర్మన్ వ్యతిరే హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ఆరుట్ల గ్రామం నుండి కురుమ కులస్తులు ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ని కలిసి తమకు సిసి రోడ్డు కావాలని కోరగా తక్షణమే ప్రత్యేక సరిపడ పది లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించడం ప్రజా పాలనకే సాధ్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, ఆరుట్ల మాజీ సర్పంచులు ఆనం గళ్ళ యాదయ్య, సుంకరి పాండరీనాథ్, మాజీ ఎంపీటీసీలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కళ్ళకు గంతలు కట్టుకుని గణితంపై అవగాహన



గణితంపై అవగాహన కల్పిస్తున్న రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అనంతప్ప

**ధారూరు, సెప్టెంబర్ 09, ప్రభాతవార్త:** ధారూర్ మండల పరిధిలోని నాగసమందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత,రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అనంతప్ప యాదవ్ కళ్లకు గంతాలు కట్టుకొని మంగళవారం విద్యార్థులకు గణితంపై అవగాహన కల్పించారు.విద్యార్థులకు గణిత బోధన పట్ల మక్కువ,ఆసక్తి కలిగించడానికి పలు మెళకువలు నేర్పారు.మొదటగా మెమరీ శతావధానంలో భాగంగా విద్యార్థుల ౧ ఒకటి నుండి వంద వరకు నెంబర్లు బోర్డుపై రాసి విద్యార్థులు చెప్పిన వివిధ రకాల పేర్లు ఆ అంకెల ప్రకారం వర్తింపజేసి కళ్ళకు గంతలు కట్టుకుని వాటిని ఒకటి నుండి వంద వరకు వరుసగా ఆ పదాల ౧ ఆరోహణ క్రమంలో, అవరోహణ క్రమంలో చెప్పారు. అలాగే మాయ కూడిక, మాయ చదరం, తేదీ చెబితే వరం చెప్పడం మొదలగు గణిత అంశాలు విద్యార్థులకు నేర్పించారు.అలాగే విద్యార్థులు జ్ఞాపకశక్తిని పెంచుకోవడానికి, ఏకాగ్రత ను పెంచుకోవడానికి తగిన సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి రమేష్, సీనియర్ ఉపాధ్యాయులు జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్, కె.వెంకటగిరి, ఎండీ వజీర్, వి శ్రీనివాస్, శ్రీనివాస్, కృష్ణయ్య, మల్లయ్య, షబానా బేగం,శ్రీప్రియ, తుల్జభవానీ, ప్రసన్న, రవి కుమార్,నిర్మల, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఈ మలుపు యమడేంజర్..!

### సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి



సాల్వేంద్రిగూడ నుండి మేకగూడ వెళ్లే రహదారి ప్రమాదకరంగా మలుపు.

**నందిగామ సెప్టెంబర్ 9 ప్రభాతవార్త**

నందిగామ మండలం మేకగూడ నుండి సల్వేంద్రిగూడ,పిట్టల గూడ వెళ్లే రహదారిపై ఉన్న మలుపులు ప్రమాదకరంగా మారాయి.ఈ మలుపుల వద్ద ఎలాంటి సూచికబోర్డ్లు లేకపోవడంతో వచ్చి పోయే వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సంబంధిత శాఖ అధికారులు రహదారి మలుపుల వద్ద అడ్డంగా ఉన్నా పిచ్చి మొక్కలను తొలగించి మెర్క్యూరీ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# రాజకీయ లబ్ది కోసమే ఉప్పల ఆరోపణలు

### -బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా ముదిరాజ్



ఆమనగల్లులో విలేకర్లతో మాట్లాడుతున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మ ముదిరాజ్

**ఆమనగల్లు,సెప్టెంబర్9, ప్రభాతవార్త:**

రీజియనల్ రింగ్ రోడ్ నిర్మాణ అలైన్‌మెంట్ విషయంలో అవగాహన రాహిత్యంతోనే బిఆర్ఎస్ నాయకుడు ఉప్పల వెంకటేశ్ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిపై అర్థరహిత ఆరోపణలు చేస్తున్నారని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మ ముదిరాజ్ అన్నారు. రాజకీయలబ్ధి కోసం అధికార పార్టీపై ఆరోపణలు చేస్తూ రైతులను రెచ్చగొట్టే చర్యలకు పూనుకుంటున్నారని, అధికార దాహంతో ఉద్దేశపూర్వకంగా ఉప్పల వెంకటేశ్ ఎమ్మెల్యే కసిరెడ్డిపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులతో కలిసి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మముదిరాజ్ విలేకరుల సమావేశంలో కసిరెడ్డిపై ఉప్పల వెంకటేశ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. చిల్లర రాజకీయాలతో ఉనికి కాపాడుకునే ప్రయత్నం క్రమంలోనే ఉప్పల వెంకటేశ్ కసిరెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. నిస్వార్థంతో శాసనసభ్యుడి విధులను నిర్వర్తిస్తూ అటు ప్రజలను, ఇటు రైతులను మెప్పు పొందుతున్న ఘనత ఎమ్మెల్యే కసిరెడ్డికి దక్కుతుందన్నారు. ట్రిబుల్ఆర్ నిర్మాణం బీజాలు గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మొదలయ్యాయని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్లక్ష్యంతో ట్రిబుల్ఆర్ ముందుకు సాగలేకపోయిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తోడ్పాటుతో నిర్మాణం జరుపుకునే ట్రిబుల్ఆర్‌పై రైతులు అపోహాలకు పాల్పడేలా బీఆర్ఎస్ పార్టీ ప్రయత్నిస్తుందని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భూనిర్వాసితులు లేరా అని ఆయన ప్రశ్నించారు. కసిరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడాన్ని జీర్ణించుకోలేకనే ఉప్పల వెంకటేశ్ రైతులను ఉసిగొల్పుతూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, అందులో రాజకీయ స్వార్థం దాగి ఉందన్న విషయాన్ని రైతులు గుర్తించాలని యాట నర్సింహ్మముదిరాజ్ అన్నారు. ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తే ఎంతటి వారైన ఖబడ్దార్ అంటూ యాట ఘాటుగా హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తెల్గమళ్ళ జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, సీనియర్ నాయకులు కృష్ణానాయక్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎంఏ ఖలీల్, కాలె మల్లయ్య, అలీమ్, బాలరాజు, ఫరీద్, శేఖర్‌గౌడ్, దుద్దు కృష్ణయాదవ్, చంద్రయ్య, మహేశ్, కొప్పు విజేందర్, రవి తదితరులు ఉన్నారు.

# రైతు సమస్యల పరిష్కారానికి ఐక్యమత్యమే ఆయుధం

### భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గజేందర్ గౌడ్



చర్లగూడ గ్రామంలో బలరామ జయంతి సందర్భంగా రైతు దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న గజేందర్ గౌడ్

**షాబాద్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** రైతు సమస్యలు ఐక్యమత్యంతో పోరాడితే సాధించుకోవచ్చని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడిగె గజేందర్ గౌడ్ అన్నారు. మంగళవారం షాబాద్ మండలం చర్లగూడ గ్రామంలో బలరామ జయంతి సందర్భంగా రైతు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్నట్లు ఆరోపించారు. సమస్య ఒకచోట ఉంటే పరిష్కారం మరోచోట వెతకడం సరైనది కాదని, రైతులు ఐకమత్యంగా సంఘంగా ఏర్పడితే సమస్యలకు పరిష్కార మార్గం కనబడుతుందన్నారు. పార్టీల వారీగా రైతులు విడిపోవడం వలన రైతు సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ గత 50 సంవత్సరాలుగా రైతులను పార్టీలకతీతంగా ఒకే వేదిక మీదికి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలోనే అతి ఎక్కువ సభ్యులు గల రైతు సంఘంగా నేడు భారతీయ కిసాన్ సంఘ్ అవతరించినట్లు చెప్పారు. గ్రామాలలో రైతులు ప్రధానంగా విద్యుత్తు, రెవిన్యూ, మార్కెటింగ్ సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యుత్ సమస్య పరిష్కరించడంలో ఆశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని అనేక సమస్యలను పరిష్కరించినట్లు వివరించారు. మార్కెటింగ్ సమస్యలను పరిష్కరించే దిశగా పోరాడేందుకు సంఘం సమాయత్తమవుతున్నట్లు చెప్పారు. రానున్న వరి సీజన్ వరకు రైతులు, రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల అధికారులతో కలిపి సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు లేఖలు అందించినట్లు చెప్పారు. దీనివల్ల వరి అమ్మకాల్లో జరుగుతున్న మోసాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందన్నారు. భలరాముడు ఆదిదేవతగా భారతీయ కిసాన్ సంఘ్ రైతు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో షాబాద్ మండల సహకార్యదర్శి పెంటయ్య, బాలరాజ్ గ్రామ సంఘ అధ్యక్ష కార్యదర్శులు రైతులు పాల్గొన్నారు.

## కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను అమలు చేయాలి

### -బికెఎం జిల్లా అధ్యక్షుడు అంజయ్య డిమాండ్



చేవెళ్ల ఆర్డిఓ కార్యాలయం ముందు దర్నా చేస్తున్న బికెఎం జిల్లా అధ్యక్షుడు అంజయ్య

**చేవెళ్ల, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామిలను అమలు చేయాలని బికెఎం జిల్లా అధ్యక్షుడు జె అంజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం చేవెళ్ల అర్డిఓ కార్యాలయం ముందు దర్నా చేశారు.ఈ సందర్భంగా బికెఎం జిల్లా అధ్యక్షుడు జె అంజయ్య మాట్లాడుతూ ఎన్నికలు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుంటే పెద్ద ఎత్తున అందోళన చేస్తామని హెచ్చరించారు.అర్హులైన వారికి ఇళ్ల స్థలాలను ఇవ్వాలన్నారు. వృద్దులను వితంతువులకు పించన్‌లను 6000 రూపాయలకు పెంచాలన్నారు. గ్రామీణ ఉపాధి హామి పథకంలో పని చేస్తున్న కూలీలకు కూలీ రెట్లు పెంచి ఉపాధి హామి పనులను 200 రోజులకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ చేవెళ్ల మండల కార్యదర్శి ఎం సత్తిరెడ్డి,వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు సరూప పెంటయ్య,చంద్రమౌళి,వెంకటమ్మ, పెంటమ్మ, పాల్గొన్నారు.

### చేవెళ్ల రెడ్డి అసోసియేషన్ అధ్యక్షుడుగా మల్గారి రాజా మల్లారెడ్డి?

**చేవెళ్ల, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త**

చేవెళ్ల రెడ్డి అసోసియోషన్ అధ్యక్షుడుగా మల్గారి రాజా మల్లారెడ్డిని ఎన్నుకోనున్నట్లు తెలిసింది. చేవెళ్ల మాజీ ఎంపిపి మల్గారి విజయభాస్కర్‌రెడ్డి తనయుడు మల్గారి రాజా మల్లారెడ్డి ఇటీవల కాలంలో రెడ్డి అసోసియోషన్‌తో వినాయక ఉత్సావాలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరిని కలుపుకుని రెడ్డి అసోసియోషన్‌లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపుతో తమ ఉనికి చాటుకున్నారు.రెడ్డి అసోసియోషన్ పెరుతో మొట్టమొదట వినాయక ఉత్సావాలను ఏర్పాటు చేసి విజయవంతంగా పూర్తి చేయడంలో మల్గారి రాజా మల్లారెడ్డి పాత్రనే కీలకమని పలువురు పెర్కోన్నారు.రెడ్డి అసోసియోషన్ ఎవరికి వ్యతిరేకం కాదని ప్రతి ఒక్కరికి అదర్శంగా నిలువాలని ఏర్పాటు చేశామని వినాయక నిమజ్జన ఉత్సావాల్లో మల్గారి రాజా మల్లారెడ్డి పెర్కోన్నారు. రెడ్డి అసోసియోషన్‌ను ఏర్పాటు చేసి ముందుదుకు తీసుకువెల్లేందుకు సమర్దుడు మల్గారి రాజా మల్లారెడ్డి పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. త్వరలో చేవెళ్ల రెడ్డి అసోసియోషన్ అధ్యక్షుడుగా ఎకగ్రీవంగా మల్గారి రాజా మల్లారెడ్డిని ఎన్నుకోనున్నామని పలువురు తెలిపారు. చేవెళ్ల రెడ్డి అసోసియోషన్‌తో చేవెళ్ళలో పలు సామాజిక కార్యక్రమాలు చేసేందుకు కూడ ప్రణాళికలు చేస్తున్నారు. చేవెళ్లలో యువత పెడతోవ పట్టకుండా యువతను చైతన్యం చేసేందుకు రెడ్డి అసోసియోషన్ ద్వారా చైతన్య సదస్సులను ఏర్పాటు చేసేందుకు సిద్దంగా ఉన్నారు.

## విద్యుత్ లైన్‌కు మరమ్మతులు



గ్రామంలో విద్యుత్ స్థంబాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

**జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబర్ ,9, (ప్రభాతవార్త):** గత కొంత కాలంగ ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ప్రస్తుతం సరిచేసినట్లు జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో విద్యుత్ సమస్య ఉందని స్థానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసువెల్లినట్లు వారు తెలిపారు. దీనికి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గ్రామంలో విద్యుత్ సమస్యలు సరిచేయాలని సూచించారు. దీంతో మంగళవారం గ్రామంలో విద్యుత్ స్థంబాలు అమర్చి లైన్ సరి చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, లింగంగౌడ్, జాలరి శ్రీను, లక్ష్మయ్య, నర్సింహులు, ఉన్నారు.

## సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యం

### మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్



షాబాద్‌లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

**షాబాద్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా వయోజన విద్యాశాఖ కృషి చేస్తుందని షాబాద్ మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ అన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉల్లాస్ జిల్లా కో ఆర్డినేటర్ పల్లె ఆనంద్ కుమార్ తో కలిసి విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షరాస్యత ర్యాలీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేయడమే ఉల్లాస్ ముఖ్య ఉద్దేశం అన్నారు. జిల్లా వ్యాప్తంగా 76000 మంది నిరక్షరాస్యులను గుర్తించామని, వారిని 6 నెలల్లో అక్షరాస్యులను గా మార్చడమే లక్షంగా పనిచేస్తున్నామని తెలిపారు. జిల్లా విద్యాధికారి సుశీంద్ర రావు, ఉపసంచాలకులు వయోజన విద్య శ్రీమతి నాగలక్ష్మి మల ఆదేశాలతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి లక్ష్మణ్, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజ్, పాఠశాల ఉపాధ్యాయులు సుశీల పాల్గొన్నారు.


## రేషన్ కార్డుల పంపిణీ



కొత్త రేషన్ కార్డులను అందుకున్న లబ్దిదారులు

**జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబర్ ,9, (ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని చేగిరెడ్డి ఘనాపూర్ గ్రామంలో మంగళవారం లబ్దిదారులకు నూతనంగ వచ్చిన రేషన్ కార్డులను మాజి సర్పంచ్ శివమౌళి, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రజలకు రేషన్ కార్డులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కోన్నట్లు వారు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేద ప్రజల కోసం నూతన రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు వారు వివరించారు. ప్రజా పాలనలో ప్రతి ఒక్కరికి మేలు జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యకమంలో వెంకటయ్య, బీమయ్య, జహంగీర్, ఇబ్రహిం, యాదయ్య, సాయిలు, అంజనేయులు ఉన్నారు.

### గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో కాళోజీ జయంతి



గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో కాళోజీ నారాయణ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ అధికారులు

**మేడ్చల్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** స్వాతంత్ర్య సమర యోదుడు కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, మేనేజర్ శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా సిఎం సహాయ నిధి

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:**

షాద్ నగర్ మున్సిపాలిటీ చెందిన రాం నగర్ కాలని చెందిన శబనాబేగం 1లక్షల 50వేల రూపాయల విలువ గల ఎల్.ఓ.సీని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని అన్నారు. ఆరోగ్య శ్రీలో వర్తించని వ్యాధులకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు వైద్యానికి అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం బాధితులకు అందిస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు. శబనా బేగం అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం ఎమ్మెల్యే దృషికి రావడంతో వెంటనే స్పందించి దరఖాస్తు చేయించారు. దీంతో స్పందించిన సీఎం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎల్ఓసిని అందించిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, మాజీ కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి, అగ్గనూర్ బ్బస్వ అందే మోహన్ ముదిరాజ్, గుగిళ్ళరవి కుమార్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## శభాష్ పోలీస్.. ట్రాఫిక్ క్లియర్..



బ్రేక్ డౌన్ తో రహదారిపై అడ్డంగా నిలిచిపోయిన వాహనాన్ని తొలగించిన ట్రాఫిక్ పోలీస్.

**నందిగామ సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:**

నందిగామ పాత జాతీయ రహదారిపై నూజివీడు సీడు పరిశ్రమ ముందు యూటర్న్ ముఖ్య కూడలిలో మంగళవారం ఉదయం బ్రేక్ డౌన్ తో నిలిచిపోయిన లారీని షాద్నగర్ ట్రాఫిక్ పోలీసులు క్రేన్ సహాయంతో పక్కకు తరలించారు. సుమారు గంటపైగా లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో వచ్చిపోయే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. తక్షణమే స్పందించిన ట్రాఫిక్ పోలీసులు క్రేన్ సాయంతో బ్రేక్ డౌన్ లారీని పక్కకు జరిపించి రోడ్డు క్లియర్ చేశారు.

### కడియాల కుంట తండా గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించండి

### జిఎంఆర్ రాయికల్ టోల్ ప్లాజా మేనేజర్‌కు వినతి



వినతి పత్రం అందజేస్తున్న రాయికల్ గ్రామస్తులు

**షాద్‌నగర్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :**

ఫరూఖ్ నగర్ మండలంలోని కడియాల కుంట తండా గ్రామపంచాయతీ కీ అభివృద్ధిలో సహకరించాలని జిఎంఆర్ టోల్ ప్లాజా మేనేజర్ ఇబ్రహీంకు గ్రామస్తులువినతి పత్రం అందజేశారు. గ్రామపంచాయతీలో అత్యవసర మైన కంప్యూటర్, ప్రింటర్ ను ఏర్పాటు చేయాలని చిన్న అవసరాలు ఉన్న షాద్ నగర్ వెళ్లడం జరుగుతుందని కావున ఒక కంప్యూటర్, ప్రింటర్ ఏర్పాటు చెయ్యాలని దీంతో గ్రామపంచాయతీ సిబ్బందితోపాటు తండా ప్రజలకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని అదేవిధంగా హైమోస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని మరియు గ్రామపంచాయతీ ప్రజల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జిఎంఆర్ రాయికల్ టోల్ ప్లాజా మేనేజర్ ఇబ్రహీం కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కడియాల కుంట తండా మాజీ సర్పంచ్ బుజ్జి రాజు నాయక్, తాప్సింగ్, శంకర్, రెడ్యా, సేవ్య,రవి, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.


## కాళోజీ నారాయణ రావుకు ఘన నివాళి



మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో కాళోజీ నారాయణ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్ తదితరులు

**మేడ్చల్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** తెలుగు సాహిత్య మహాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కాళోజీ రచనలు ప్రజల హక్కుల కోసం, స్వేచ్ఛ కోసం పోరాడే శబ్దంగా నిలిచాయని కొనియాడారు. ఆయన రచనలు ప్రజల భావోద్వేగాలకు అద్దం పడుతూ సాధారణ జనాల భాషలో, సామాజిక సందేశంతో ఉంటాయని, ఆయన రచనలు సమాజానికి మార్గదర్శకం అని అన్నారు. తెలంగాణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ప్రజల మనిషి, తన కవిత్వంతో స్వరాష్ట్ర ఆకాంక్షను రగిలించిన ప్రజా కవి కాళోజీ జయంతి ని తెలంగాణ భాష దినోత్సవంగా జరుపుకోవడం హర్షణీయమని అన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొనారు.

## కురువగూడలో ఘనంగా గణనాథుని నిమజ్జనం



కురువ గూడ గ్రామంలో లడ్డును కైవసం చేసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ సంధ్య మల్లికార్జున్ గౌడ్

**షాబాద్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:**

షాబాద్ మండలం కురువగూడ గ్రామంలో సోమవారం రాత్రి గణేశుని నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. గ్రామంలో యువత యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాధుని రూ.3 లక్షల అరవై ఒక్క వేలకు లడ్డూను గ్రామ మాజీ సర్పంచ్ సంధ్య మల్లికార్జున్ గౌడ్ దక్కించుకున్నారు. గణనాథుని నిమజ్జన కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.